సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




గురువారం 09 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 311 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## ఘన హైకమిషనర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

సందేశం టైమ్స్, జూబ్లీహిల్స్, ఏప్రిల్ 9, ప్రతినిధి: ఎ. రేవంత్ రెడ్డి గారిని క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిశారు. ఘన దేశానికి హైకమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చిన ఆయన, ఘన–తెలంగాణ మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్య, శాస్త్ర సాంకేతికం, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం పెంపొందించాలని కోరారు. ఈ విషయాలపై సీఎం సానుకూలంగా స్పందిస్తూ భవిష్యత్తులో ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## తెలంగాణలో పెట్టుబడులకు అంతర్జాతీయ విమాన తయారీ సంస్థ ఆసక్తి



సందేశం టైమ్స్, జూబ్లీహిల్స్, ఏప్రిల్ 9, ప్రతినిధి: ఎ. రేవంత్ రెడ్డి గారిని అంతర్జాతీయ విమాన తయారీ రంగానికి చెందిన సంస్థ ప్రతినిధి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సంస్థ భారతదేశంలో సైనిక రవాణా విమానాల తుది అసెంబ్లీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. అలాగే ప్రపంచ అవసరాల కోసం భారతదేశంలోని భాగస్వామ్య సంస్థలతో కలిసి యుద్ధ విమానాల భాగాల తయారీకి ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని సీఎం సానుకూలంగా స్పందించారు.




## సుస్థిర అభివృద్ధి దిశగా గ్రీన్ ప్రాపర్టీ షో ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రతినిధి: ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణను నెట్ జీరో భవిష్యత్తు వైపు నడిపిస్తూ సుస్థిర పట్టణాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ మూడవ ఎడిషన్ గ్రీన్ ప్రాపర్టీ ప్రదర్శన 2026 బ్రోచర్‌ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ ప్రదర్శన నిర్వహించబడుతుండగా, కౌన్సిల్ జాతీయ చైర్మన్ సి. శేఖర్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో మే 22 నుండి 24 వరకు “మీ కోసం మెరుగైన గృహాలు” అనే అంశంతో ఈ కార్యక్రమం జరగనుంది. రాష్ట్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా గ్రీన్ సర్టిఫికేషన్ పొందిన నిర్మాణ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. గాలి నాణ్యత మెరుగుదల, విద్యుత్ ఆదా, తక్కువ ఖర్చుతో జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా ఈ ప్రదర్శన కొనసాగనుండగా, పర్యావరణానికి అనుకూలమైన ఉత్పత్తులు, సేవలు అందుబాటులో ఉంచనున్నారు. ప్రజలు తమ జీవనశైలిని పర్యావరణ హితంగా మార్చుకునేందుకు, దీర్ఘకాలిక శ్రేయస్సు కలిగించే గృహ పరిష్కారాలను తెలుసుకునేందుకు ఇది ఉత్తమ వేదికగా నిలవనుంది.

## డబుల్ బెడ్ కాలనీల్లో దుకాణాల వేలం ప్రారంభం




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రతినిధి: హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని డబుల్ బెడ్ గృహ కాలనీల్లో నిర్మించిన 1400కు పైగా దుకాణాల బహిరంగ వేలం ప్రక్రియ ఈ నెల 9 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని మొత్తం 36 కాలనీల్లో ఉన్న ఈ దుకాణాలను వేలం ద్వారా విక్రయించేందుకు జిల్లా అధికారుల ద్వారా నోటీసులు జారీ అయ్యాయి. మొదటగా రంగారెడ్డి జిల్లాలోని 8 కాలనీల్లో 273 దుకాణాలకు ఏప్రిల్ 9, 10 తేదీల్లో వేలం నిర్వహించనుండగా, అనంతరం హైదరాబాద్ జిల్లాలో 10 కాలనీల్లో 77 దుకాణాలకు 15, 16 తేదీల్లో, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 12 కాలనీల్లో 892 దుకాణాలకు 15, 17 తేదీల్లో, సంగారెడ్డి జిల్లాలో 6 కాలనీల్లో 372 దుకాణాలకు 15 నుంచి 18 మరియు 21 తేదీల్లో వేలం జరగనుంది. 60 నుంచి 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ దుకాణాలను యథాతథ స్థితిలో విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత కార్యాలయాల్లో ఉదయం 11 గంటలలోపు ముందస్తు ధనం చెల్లించి నమోదు చేసుకోవచ్చున్నారు. ఈ వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా కాలనీల అభివృద్ధి, నిర్వహణ కోసం ప్రత్యేక నిధిగా వినియోగించి, లైట్లు, లిఫ్టులు, నీటి సౌకర్యాలు, మరమ్మత్తులు వంటి అవసరాలకు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో కాలనీల్లో నివసించే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభించనున్నాయి.



## సురక్షిత మాతృత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహణ

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 9, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో మూడవ రోజు “సురక్షిత మాతృత్వ పద్ధతులు” పై కార్యక్రమం సూర్యాపేట ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మాతా–శిశు విభాగంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరై మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీల పరీక్షల ప్రాముఖ్యత, సాధారణ ప్రసవాలు, ఆసుపత్రిలో ప్రసవాల అవసరాన్ని వివరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పిస్తూ గర్భంలో శిశువు లింగ నిర్ధారణ నిషేధం, దానికి సంబంధించిన శిక్షలను వివరించారు. ఆరోగ్య సిబ్బంది ప్రదర్శించిన సందేశాత్మక నాటికను అభినందించి, నర్సింగ్ విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు తగిన కూర్చోవడానికి సదుపాయం, త్రాగునీరు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది “సురక్షిత మాతృత్వం”పై నాటికలు, పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. తల్లి–శిశు మరణాలను తగ్గించడం, ముందస్తు గుర్తింపు, సమయానుకూల వైద్య సేవలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. సుమారు 80 మంది వైద్య సిబ్బంది, గర్భిణీలు, ప్రసవానంతర మహిళలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ అధికారులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరమణ, ప్రభుత్వ ఆసుపత్రి అధికారి శ్రావణ్ కుమార్, ఇతర వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 9, ప్రతినిధి: జిల్లాలో చట్ట విరుద్ధంగా ప్రైవేట్ ఆసుపత్రులు గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినచో కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం నిర్వహించగా, ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ నియంత్రణ చట్టం ప్రకారం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, అర్హత ఉన్నవాటికి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలు నిర్వహించిన ఆసుపత్రులను మూసివేయడంతో పాటు ప్రాంగణాలను సీల్ చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల అనంతరం పది రోజుల్లో నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని, పోలీసులతో సమన్వయం కలిగి క్రమమైన తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. గర్భ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ అన్ని రికార్డులను నవీకరించాలని, గర్భస్రావాలపై సమీక్షలు నిర్వహించి సంబంధిత కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. పెండెం వెంకట రమణ మాట్లాడుతూ జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ ద్వారా అనేక ఆసుపత్రులకు తాత్కాలిక, శాశ్వత అనుమతులు జారీ చేసినట్లు, అర్హతలేని కొన్ని కేంద్రాలను తిరస్కరించి ఒక స్కానింగ్ కేంద్రాన్ని మూసివేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అధికారి శ్రావణ్ కుమార్, వైద్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ హక్కుల కోసం 'హల్లో ముదిరాజ్ – ఛలో గాంధీ భవన్' ముట్టడి పిలుపు

సందేశం టైమ్స్ /మహబూబ్‌నగర్ ఏప్రిల్ 9ప్రతినిధి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ ముదిరాజ్ సామాజిక వర్గానికి న్యాయం చేయడంలో విఫలమైందని ముదిరాజ్ చైతన్య వేదిక విమర్శించింది. ముదిరాజ్ వర్గ హక్కులు, సామాజిక న్యాయం సాధన కోసం ఈ నెల 10న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ గాంధీ భవన్ వద్ద "హల్లో ముదిరాజ్ – ఛలో గాంధీ భవన్" ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్ యువత, బీసీ, బహుజన సంఘాల ప్రతినిధులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోకాపేట్ భూమిపై ఉన్న ట్రస్ట్ రద్దు చేసి ముదిరాజ్ జాతికి కేటాయించడం, మత్స్యశాఖ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ, సంబంధిత ప్రజాప్రతినిధులపై ఉన్న ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతిరావు పూలే బీసీ సంఘం అధ్యక్షుడు శ్రవణ్, నరేష్ ముదిరాజ్, బాలు ముదిరాజ్, సంజయ్ ముదిరాజ్, అనిల్ ముదిరాజ్, రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకుడు నాగయ్య కుమారుని వివాహానికి నేతల శుభాకాంక్షలు

సందేశం టైమ్స్ వట్పల్లిఏప్రిల్ 9,ప్రతినిధి సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం కేంద్రం లోని దరఖాస్తు పల్లిగ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మామిడి పల్లి నాగయ్య కుమారుని వివాహ వేడుకలో వట్పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రతాప్ రమేష్ జోషి తదితర పార్టీ నాయకులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో ముచ్చటించి, వివాహ వేడుకను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో బేతాళ స్వామి జాతర... భక్తులతో కిక్కిరిసిన ఆలయం



సందేశం టైమ్స్ అల్లాదుర్గం,మండల్ ఏప్రిల్ 9ప్రతినిధి మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల కేంద్రం అల్లాదుర్గంలో బేతాళ స్వామి జాతర ఘనంగా కొనసాగుతోంది. గత మూడు నాలుగు రోజులుగా గ్రామంలోని దేవి దేవతలకు బోనాలు సమర్పించగా, బేతాళ స్వామికి బండ్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు తమ కోరికలు తీర్చుకోవాలనే ఆకాంక్షతో పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ జాతరలో బోనాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతుండగా, వేలాది మంది భక్తులు హాజరై తమ మనోకామనలు నెరవేర్చుకుంటున్నారు. తెలంగాణలోరాష్ట్రము లో అల్లాదుర్గంలో ఉన్న బేతాళ స్వామి ఆలయం విశిష్టతను కలిగి ఉందని భక్తులు భావిస్తున్నారు.

## సురక్షిత మాతృత్వంతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం: నిర్మల జయప్రకాశ్ రెడ్డి






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 9, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో సురక్షిత మాతృత్వంతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని నిర్మల జయప్రకాశ్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో జరిగిన "సురక్షిత మాతృ దినోత్సవం" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అవసరమైన పరీక్షలు, అధిక ప్రమాద గర్భధారణలు, శస్త్రచికిత్సలు, అత్యవసర పరిస్థితులు, గర్భ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గర్భధారణ ప్రారంభం నుంచే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని, చిన్న వయసులో గర్భధారణలను అరికట్టడం అవసరమని నిర్మల జయప్రకాశ్ రెడ్డి సూచించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ తల్లి–శిశు ఆరోగ్య పరిరక్షణకు సమన్వయంతో పనిచేసి మాతృ మరణాల రేటును తగ్గించాలని, సమయానుకూల పరీక్షలు, టీకాలు, పోషకాహారం ద్వారా తల్లి–బిడ్డల ఆరోగ్యం కాపాడవచ్చని తెలిపారు. గ్రామస్థాయిలో ఆశా, ఏఎన్ఎంల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వసంత్ రావు, ప్రభుత్వ ఆసుపత్రి అధికారి డా. మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ డా. కవిత, ఇతర వైద్యులు, సిబ్బంది, గర్భిణీలు పాల్గొన్నారు.




## పహాడీ షరీఫ్‌లో గోరక్ష కార్యకర్తలపై కేసులు వద్దు – గో మాఫియాపై చర్యలు తీసుకోవాలి--- విశ్వహిందూ పరిషత్ డిమాండ్

సందేశం టైమ్స్ ఏప్రిల్ 9,ప్రతినిధి పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోవులను రక్షించే క్రమంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ్ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర గోరక్ష విభాగ్ ప్రముఖ్ సుభాష్ చందర్ జీ ఆధ్వర్యంలో వి హెచ్ పి గోరక్ష విభాగం కార్యకర్తలు పోలీస్ స్టేషన్ సీఐని కలిసి వినతి పత్రం సమర్పించారు. గోవులను కాపాడే వారిపై కేసులు నమోదు చేయకుండా, గో మాఫియా కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.




## పిల్లల రక్షణకు పోక్సో చట్టంపై అవగాహన... విద్యార్థుల్లో చైతన్యం

సందేశం టైమ్స్ సంగారెడ్డి, ఏప్రిల్ 09ప్రతినిధి సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సంగారెడ్డి మండలంలోని ఫసల్వాది ఎం.ఎన్.ఆర్ ఉన్నత పాఠశాలలో భరోసా కోఆర్డినేటర్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, పిల్లలపై జరిగే లైంగిక దాడులపై విధించే కఠిన శిక్షలు గురించి వివరించారు. భరోసా కేంద్రం ద్వారా బాధితులకు అందించే సహాయం, సేవలపై కూడా స్పష్టమైన అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే లక్ష్యాలను నిర్ణయించుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచిస్తూ, యవ్వన దశలో ఎదురయ్యే ఆకర్షణలు, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, విద్య ప్రాముఖ్యతపై విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మారియా నాతన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు."

## హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ క్యాన్సర్‌కు అడ్డుకట్ట: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 9, ప్రతినిధి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ టీకా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు తప్పనిసరిగా ఈ టీకా తీసుకోవాలని సూచించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణలో ఈ టీకా ప్రభావవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. బాలికల ఆరోగ్య రక్షణ కోసం తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని టీకా వేయించేందుకు ముందుకు రావాలని కోరారు. జిల్లాలో 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల 11,664 మంది బాలికలను గుర్తించి వారికి టీకా అందించే కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ చేపట్టిందని తెలిపారు. సంక్షేమ, విద్యాశాఖల అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించి టీకా వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అధికారి శ్రవణ్ కుమార్, వైద్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: టిపిటిఎఫ్

సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 9, ప్రతినిధి: ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, డి.ఏలు, హెల్త్ కార్డులు, పి.ఆర్.సి, సి.పి.ఎస్ రద్దు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టిపిటిఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు రాపర్తి రామ నరసయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బిక్షం కోరారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తామని, బాధ్యతల కోసం నిలబడుతూ హక్కుల సాధన కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి కోదాడ పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన టిపిటిఎఫ్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ఇటీవల మార్చి 31, 2026న ఉద్యోగ విరమణ పొందిన పోతురాజు సత్యనారాయణ, పోతురాజు నరసయ్య, పేరం ముత్తయ్యలను శాలువాలు, మెమొంటోలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బడుగుల సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముత్తవరపు రామారావు, డి ఎన్ స్వామి, పొనుగోటి కోటయ్య, కొల్లు శ్రీనివాసరావు, ఏ హనుమంతరావు, కైలాస వెంకటేశ్వర్లు, సుధాకర్, రాజమహేంద్ర, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## డిస్ట్రిక్ట్ జడ్జిని కలిసిన కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 9, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కోర్టులో కోదాడ బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గం జిల్లా న్యాయమూర్తి పి లక్ష్మీ శారదను మర్యాదపూర్వకంగా కలిసింది. అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి ఆదేశానుసారం ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా కోదాడలో నిర్మాణంలో ఉన్న నూతన కోర్టు భవన సముదాయ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి సహకరించాలని, కోర్టుల్లో అవసరమైన సిబ్బందిని నియమించాలని కార్యవర్గం సభ్యులు కోరారు. అలాగే న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జిల్లా జడ్జికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి జానీ పాషా, ఖజాంచీ కోడూరూ వెంకటేశ్వరరావు, గాలి శ్రీనివాస్ నాయుడు, షేక్ రంజాన్ భాష, బెడుద దుర్గ, పోలూరి హేమలత, ఓరుగంటి ధనలక్ష్మి, ఎస్ కే నాగుల్ పాషా, పిడతల హనుమంతరావు, చెన్న పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

## కంది సెంట్రల్ జైలు ఆకస్మిక తనిఖీ... గురుకుల పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 9, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య కంది సెంట్రల్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేసి ఖైదీలకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జైలు బెరక్స్, గదులు, వంటగది, స్నాన గదులు తదితర సదుపాయాలను పరిశీలించి ఖైదీలతో మాట్లాడి భోజనం, ములాఖత్, బెయిల్ వంటి అంశాలపై సమాచారం సేకరించారు. ఖైదీలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని జైలు అధికారులకు సూచిస్తూ, కేసుల పరిష్కారం కోసం ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. అనంతరం గిర్మాపూర్‌లోని తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, బాలల సంరక్షణ, పోక్సో, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక నిరోధక చట్టాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏవైనా న్యాయ సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ సహాయక న్యాయవాదులు, జైలు అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దారెడ్డి పేటలో శ్రీ తుల్జా భవాని మాత 33వ జాతర ఘనంగా ప్రారంభం



సందేశం టైమ్స్ పుల్కల్ మండలం, ఏప్రిల్ 09 పుల్కల్ మండల్ రిపోర్టర్సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డి పేట గ్రామంలో శ్రీ తుల్జా భవాని మాత 33వ జాతర మహోత్సవాలు ఈ నెల 9 నుండి 13 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి పరుశురాం తెలిపారు. జాతర సందర్భంగా తొలి రోజు గాయత్రి పూజ, గంగా పూజ, అభిషేకం, కుమార్చన, జయాది హోమం నిర్వహించగా, రెండవ రోజు ముఖండ దీపారాధన, గంగను తీసుకురావడం, అగ్ని ప్రతిష్ట, 251 కలశాలతో మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. మూడవ రోజు చండీ హోమం, లక్ష దీపారాధన, భజన కార్యక్రమాలు, నాలుగవ రోజు ఆకుల పూజ, పుష్పార్చన, బండ్ల బోనాలు, కోలాటం నృత్యాలు నిర్వహించనున్నారు. ఐదవ రోజు దేవి కళ్యాణం, గీతాలాపన, గోందాలం, పల్లకి సేవలతో జాతర ముగుస్తుందని తెలిపారు. ప్రతి రోజు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంటూ గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని పూజారి కోరారు.

## స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు... ఉల్లంఘనలపై కఠిన చర్యలు: కలెక్టర్ ప్రావీణ్య





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 9, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో నిబంధనలు ఉల్లంఘిస్తూ పనిచేస్తున్న స్కానింగ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గర్భ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై జరిగిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, స్కానింగ్ కేంద్రాలకు నమోదు, పునరుద్ధరణను నిబంధనలు పాటించే వాటికే పరిమితం చేయాలని స్పష్టం చేశారు. గర్భిణీలకు స్కానింగ్ అనంతరం శిశువు లింగాన్ని వెల్లడించడం పూర్తిగా నిషేధమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం జైలు శిక్షతో పాటు జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు. లింగ నిర్ధారణ, భ్రూణహత్యలను ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అన్ని కేంద్రాలు రికార్డులను సక్రమంగా నిర్వహించి అధికారుల పరిశీలనకు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన చిన్న, పెద్ద ఉల్లంఘనలపై వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వసంత్ రావు, ప్రభుత్వ ఆసుపత్రి అధికారి డా. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మాతృ మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 9, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ప్రసవాల సమయంలో ఎక్కడా మాతృ మరణాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ క్రమం తప్పకుండా వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన మాతృ మరణాల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో జరిగిన ప్రతి మాతృ మరణ ఘటనను సవివరంగా పరిశీలిస్తూ ఆసుపత్రుల వారీగా కారణాలు, వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఉందా అనే అంశాలను విశ్లేషించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గర్భధారణ ప్రారంభం నుంచే క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, గర్భిణులకు సరైన మార్గదర్శకాలు అందిస్తూ సకాలంలో చికిత్సలు అందేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని సూచించారు. అధిక ప్రమాద గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్య నిపుణులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని, మాతృ మరణాల నివారణ ప్రతి వైద్యాధికారుల బాధ్యతగా భావించి పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వసంత్ రావు, ప్రభుత్వ ఆసుపత్రి అధికారి డా. మురళికృష్ణ, తల్లి–శిశు ఆరోగ్య కార్యక్రమ అధికారి డా. నాగలక్ష్మి, డా. శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## కంగ్టి మండలంలో కరెంట్, తాగునీటి సమస్యలపై రేపు సమీక్షా సమావేశం



సందేశం టైమ్స్ కంగ్టి, ఏప్రిల్ 09ప్రతినిధి సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో నెలకొన్న కరెంట్, తాగునీటి సమస్యల పరిష్కారానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో గురువారం (ఏప్రిల్ 9) ఉదయం 11 గంటలకు కంగ్టి లోని బస్వాప్రదీప్ ఫంక్షన్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని సమస్యలకు తక్షణ పరిష్కార మార్గాలు అన్వేషించడం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. గ్రామాల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజలు, సర్పంచ్‌లు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను తెలియజేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## కుల రహిత సమాజ నిర్మాణం కోసం 19న సాంస్కృతిక ఉత్సవాలు




సందేశం టైమ్స్ నారాయణఖేడ్, ఏప్రిల్ 09ప్రతినిధి సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ సమానత్వ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈనెల 19న సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న కుల రహిత సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) మరియు ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి. అశోక్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల స్ఫూర్తితో కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు సమాజంలోని ప్రతి వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల సందర్భంగా మహనీయుల పోరాటాలు, త్యాగాలపై ఉపన్యాసాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మేధావులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.




## భూభారతి పోర్టల్‌లో తప్పుల్లేకుండా వివరాలు నమోదు చేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 9, ప్రతినిధి: భూభారతి పోర్టల్‌లో వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దార్లతో భూభారతి, ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ స్థాయిలో చలాన్ సృష్టించిన తర్వాత రుసుము చెల్లిస్తే అది ఆర్డీవోకు వెళ్లి, అక్కడ 13 బి ప్రక్రియ పూర్తయ్యాక ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే పోర్టల్‌లో పట్టాదారు పేరు నమోదవుతుందని తెలిపారు. ఒకవేళ కొనుగోలుదారుడు అఫిడవిట్‌లో తప్పు వివరాలు నమోదు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేసి చలాన్ ద్వారా చెల్లించిన డబ్బును తిరిగి ఇవ్వబోమని హెచ్చరించారు. యాసంగి సీజన్‌లో వరి కొనుగోలు కేంద్రాలను ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రతిరోజూ సందర్శించి పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## మాతృ-శిశు ఆరోగ్యానికి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 9, ప్రతినిధి: గర్భిణీ స్త్రీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెదక్ కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో నిర్వహించిన సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువు ఆరోగ్యంగా ఉంటాడని, దాంతో ఆరోగ్యవంతమైన కుటుంబం, సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వివాహానికి ముందు, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన వైద్య పరీక్షలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఆరోగ్య వారోత్సవాల ద్వారా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యులు గ్రామీణ స్థాయిలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. శ్రీరామ్, డీసీహెచ్ఎస్ శివదయాల్ తదితరులు తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు, పోషకాహారం, సమయానుకూల వైద్య పరీక్షల ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు నరేష్, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ చేతుల మీదుగా వధువుకు పుస్తె మెట్టెలు అందజేత

సందేశం టైమ్స్, పుల్కల్, ఏప్రిల్ 9, అందోల్ నియోజకవర్గం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో జరిగిన వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి ఆనవాయితీగా నూతన వధువుకు పుస్తె మెట్టెలను అందించే కార్యక్రమంలో భాగంగా నంది మాణిక్ రెడ్డి-మాధవి దంపతుల కుమార్తె మనసుకు పుస్తె మెట్టెలను మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఆడపిల్లకు పెళ్లి సందర్భంగా పుస్తె మెట్టెలు అందించడం గొప్ప సంప్రదాయమని, అలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డికి ఈ అవకాశం దక్కడం అదృష్టకరమని కొనియాడారు. గ్రామంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు సంతోషం కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస చారి, మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో విస్తృత పర్యటన... విద్యాలయం, రేషన్ షాప్ తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 9, ప్రతినిధి: రామాయంపేటలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ విస్తృతంగా పర్యటించి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. విద్యాలయంలో మౌలిక వసతులు, విద్యా నైపుణ్యాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, పదో తరగతి విద్యార్థినులకు స్వయంగా పాఠాలు బోధించి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, నాణ్యమైన గుణాత్మక విద్య అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రేషన్ దుకాణాన్ని పరిశీలించి మూడు నెలల సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని అధికారులకు ఆదేశించారు.



## హ్యాండ్లూమ్ టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 9, ప్రతినిధి: హ్యాండ్లూమ్ టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ద్వారా ఈ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి అర్హతతో 2026-27 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం డిప్లమా కోర్సులో మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కలిగిన అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం సంబంధిత సంస్థను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

## చాముండేశ్వరి ప్రీమియర్ లీగ్‌కు చిలిపిచెడ్ ఎస్సైకి ఆహ్వానం



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 9, ప్రతినిధి: నేడు నిర్వహించనున్న చాముండేశ్వరి ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా చిలిపిచెడ్ మండల పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను ఆహ్వానించారు. చిట్కుల్ గ్రామానికి చెందిన క్రికెట్ మేనేజ్మెంట్ యువకులు మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి విచ్చేయాలని కోరారు. ఈ టోర్నమెంట్‌ను చిట్కుల్ గ్రామ ఆధ్వర్యంలో యువత నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## బీఆర్ఎస్ నేతలు అసత్యాలు ఆపాలి... లేకపోతే ఖబడ్దార్: మంత్రి పొంగులేటి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రతినిధి: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ నేతలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను చేసిన తప్పులు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరిన మంత్రి, నాదర్‌గుల్ భూముల విషయంలో అన్ని నిర్ణయాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే జరిగాయని ఆధారాలతో వివరించారు. 2014లో రిజిస్ట్రేషన్, 2016లో మ్యుటేషన్, 2021-22లో భూమి అభివృద్ధి పనులు బీఆర్ఎస్ పాలనలోనే జరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోర్టుల్లో పెండింగ్ కేసులపై కౌంటర్ దాఖలు చేసి ప్రభుత్వ హక్కులను కాపాడుతున్నామని తెలిపారు. వట్టినాగులపల్లి భూముల వివాదం కుటుంబ అంతర్గత సమస్య మాత్రమేనని, ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. కొత్వాల్‌గూడ క్రషర్ వ్యవహారంలో కూడా అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులకు ఆ భూముల వ్యవహారాల్లో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన మంత్రి, ఆరోపణలు నిరూపించాలని ప్రతిపక్షాలను సవాల్ చేశారు. గత పదేళ్లలో జరిగిన అవినీతిని దాచేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, తమ ప్రభుత్వంపై బురదజల్లే యత్నాలు ఫలించవని హెచ్చరించారు. ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని, అక్రమాలపై విచారణలు కొనసాగుతాయని మంత్రి పేర్కొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.